క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



లక్ష్మీపురం: మూడు నెలల కిందట ఇంట్లోంచి బయటకు వెళ్ళిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బొంగరాల బీడు 1వ లైన్‌కు చెందిన షేక్ సలీం మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే రోజు మాదిరిగా జూలైలో ఇంట్లోంచి పనికి వెళ్ళిన సలీం తిరిగి రాలేదు. బంధువులు, సన్నిహితులు ఇండ్లలో వెతికినా కనిపించలేదు. దీంతో భార్య గురువారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షేక్ సలీం ఆచూకీ తెలిసిన వారు 8688831615 లేదా పోలీస్ స్టేషన్ నంబర్ 0863–2231955 సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

ఏపీపీ పల్లపు కృష్ణకు సత్కారం



నగరంపాలెం: అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పల్లపు కృష్ణను బీసీ, దళిత బహుజన సంఘ నాయకులు గురువారం శాలువాలతో సత్కరించారు. మేడికొండూరు పాలడుగు వద్ద ఓ మహిళపై గ్యాంగ్ రేప్ జరిగిందని, కేసులో బాధితురాలు తరపున సమర్థంగా పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారని ప్రశంసించారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో పల్లపు కృష్ణను సత్కరించారు. ముద్దాయిలకు శిక్షపడేలా కృషి చేసిన ప్రభుత్వానికి, రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌లకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షులు బీసీ రమణ, దళిత బహుజన సంఘ నాయకులు ఓర్సు ప్రేమ్‌రాజు, గోగుల కోటేశ్వరరావు, బీసీ నాయకులు చల్లా పుల్లారావు పాల్గొన్నారు.

అప్పులతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: తీసుకున్న అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో పురుగుల మందు తాగి ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంతానికి చెందిన నన్నపనేని సంపత్‌కుమార్ (31)కి భార్య నాగప్రసన్న, ఇద్దరు సంతానం ఉన్నారు. సంపత్‌కుమార్ మెడికల్ షాపులో గుమస్తాగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలంటూ మనోవేదనతో సెప్టెంబర్ 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సంపత్ కుమార్ మృతి చెందాడు.భార్య ప్రసన్న ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించడంతో పాటు వైఫల్యాలను విశ్లేషించుకుంటూ ముందుకు సాగాలని రోటరీ ప్రేరణ సభ్యురాలు కె.చందన తెలిపారు. రాజమండ్రిలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక నవభారత్ నగర్‌లోని నాథ్ వెల్‌నెస్ సెంటర్లో సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందన మాట్లాడుతూ చిన్నారులు తమకిష్టమైన క్రీడల్లో నిత్యం సాధన చేయాలని సూచించారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి మొత్తం 65 మంది పాల్గొన్నారన్నారు. వీరంతా 13 బంగారు, 9 రజతాలు, 12 కాంస్య పతకాలు కలిపి మొత్తం 34 సాధించారని చెప్పారు. వీరిలో ప్రతిభకనబరచిన వారిని ఈ నెల 17 నుంచి 19 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్ జోన్ నేషనల్స్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాథ్ వెల్‌నెస్ సెంటర్ అధినేత నూతనపాటి గోపీనాథ్ పాల్గొన్నారు.


ఇస్రో విజయాలు దేశానికి గర్వకారణం

లక్ష్మీపురం: ఇస్రో సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణమని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో గురువారం 'ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు' సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో విజయాలు– దేశ ప్రజలకు గర్వకారణం' అనే అంశంపై సదాశివం మాట్లాడారు. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విక్రమ్ లాండర్ విజయవంతంగా చందమామ ఉపరితలంపై వాలడం, ప్రజ్ఞా రోవర్లు ఉపరితలం మీద పరిశోధిస్తూ కదలటం లాంటి అసాధారణ ఫలితాలు దేశ ప్రజలు విస్మయం పరిచాయని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఆర్.వి సింగరయ్య పాల్గొన్నారు.

యువతనూ వేధిస్తున్న కీళ్ల నొప్పులు

- పెరుగుతున్న సమస్యలు
- ఆధునిక జీవన శైలి కారణం
- కీళ్ల నొప్పులను తేలిగ్గా తీసుకోవద్దు
- బాధితులందరికీ ఆపరేషన్ అవసరం లేదు
- రేపు వరల్డ్ ఆర్థరైటీస్ డే

గుంటూరు శ్రీనగర్‌కు చెందిన సాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. నిత్యం కంప్యూటర్ వద్ద కూర్చొని పనిచేయడం, కుటుంబం అంతా గుంటూరులో ఉండటంతో ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకోవడం, వ్యాయామం లేకుండా ఇంటికే పరిమితం అవడంతో 30 ఏళ్ల నిండకుండానే ఆర్థరైటీస్ బారిన పడ్డాడు. చిన్న వయస్సులోనే కీళ్ల నొప్పుల సమస్య రావడంతో వైద్యులను సంప్రదించాడు. యంగ్ ఆర్థరైటీస్ సమస్య ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలను వివరించారు.





గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల నేడు యువత ఆర్థరైటీస్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లు దాటగానే యంగ్ ఆర్థరైటీస్ సమస్యతో వస్తున్నారని, దీనిని సకాలంలో గుర్తించి నివారించాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నారు. కీళ్ళ బాధల నుంచి విముక్తుల్ని చేసి మనిషికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించటమే ప్రపంచ ఆర్థరైటీస్ డే ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు 12న ప్రపంచ ఆర్థరైటీస్ డేను 1996 నుంచి ఆర్థ్రరైటిస్ అండ్ రుమాటిజం ఇంటర్‌నేషనల్(ఏఆర్ఐ) సంస్థ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆర్థరైటీస్ అంటే ?

కీళ్ళలో గుజ్జు (సైనోవియల్ ఫ్లూయిడ్) ప్రతి వ్యక్తికి వయస్సు 50 ఏళ్ళు వచ్చేదాకా ఉత్పత్తి అవుతూ, ఎక్కువగా ఉంటుంది. 50 ఏళ్ల వయస్సు దాటాకా కీళ్ళలో గుజ్జు ఉత్పత్తి ఆగిపోతుంది. మృధులాస్థి (కార్టిలేజ్)కి సరిపడా ఆహార పోషణ పదార్థాలు వెళ్ళవు. కార్టిలేజ్ ఎండిపోయి పగుళ్ళు వచ్చి పూర్తిగా దెబ్బతింటుంది. దీన్నే ఆర్థరైటీస్ అంటారు.

రావడానికి కారణాలు

స్థూలకాయం, శారీరక వ్యాయామం లేకపోవడం, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు చూస్తూ గంటల కొద్దీ కుర్చీలకే అతుక్కుని పని చేయడం, ఎక్కువసేపు కూర్చుని పనులు చేయడం వల్ల కీళ్ళలో గుజ్జు (కార్టిలేజ్) తగ్గిపోయి ఆర్థరైటీస్ వస్తుంది. వయస్సుతో పాటు, నడకలో ఉన్న రాపిడి వల్ల అరిగిపోయి గుజ్జు ఉత్పత్తికి, వినియోగానికి సమతుల్యం లేకపోవడం వల్ల వస్తుంది. కార్టిలేజ్ పార పోయి ఎముక ఎక్స్‌పోజ్ అవడం వల్ల మోకీళ్ల నొప్పులు వస్తున్నాయి. జన్యుపరమైన కారణాలతో మహిళల్లో ఇది ఎక్కువగా వస్తుంది. భారతదేశ సంప్రదాయాల ప్రకారం స్త్రీలు ఇంటి పనులను కింద కూర్చుని చేయడం, మోకీళ్ళపై ఎక్కువ భారం వేసి పనులు చేయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. పొగ తాగడం, మద్యం సేవించడం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, 50 సంవత్సరాలు పైబడిన వారిలోనూ, గతంలో కీళ్ళకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల, మహిళల్లో రుతు క్రమం ఆగిపోయినవారిలో కీళ్ళ అరుగుదల ఉంటుంది.

ఆర్థరైటీస్ బాధితులు

జిల్లాలో 300 మంది ఆర్థోపెడిక్ వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ పది మంది బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. బాధితుల్లో మగవారికంటే ఆడవారి సంఖ్య చాలా ఎక్కువ. బాధితులు వందమంది ఉంటే వారిలో 75 మంది ఆడవారే. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 50 నుంచి 70 మంది కీళ్ళ నొప్పులతో వైద్యం పొందుతున్నారు.

ఆపరేషన్ చేసిన రోజే నడుస్తున్నారు



మోకీళ్ల బాధితులకు నేడు అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. కీళ్ళ నొప్పులతో బాధపడే ప్రతి వంద మందిలో ఐదు నుంచి పది శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. ఫాస్ట్ ట్రాక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలతో ఆపరేషన్ చేసిన రోజే నడుస్తున్నారు. మూడు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చు. మోకీళ్ళ మార్పిడి ఆపరేషన్లలో నూటికి 99.2శాతం విజయాలు ఉన్నాయి. మోకాళ్లలో అనవసరంగా ఇంజక్షన్లు చేయించడం ద్వారా జాయింట్ దెబ్బతింటుంది. కార్టిలైజ్ డామేజ్ జరగడం, జాయింట్‌లో ఉంటే కుషన్ దెబ్బతింటుంది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

నివారణ చర్యలు

క్రమబద్ధమైన వ్యాయామం చేస్తూ బరువును నియంత్రణలో పెట్టుకోవాలి. సమీకృత ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, విటమిన్–డీ, కాల్షియం అధికంగా లభించే పాలు, పాల ఉత్పత్తులు, కోడిగుడ్లు, చేపలు, మొలకెత్తిన విత్తనాలు, రాగులు, జొన్నలు, ఆహారంలో తీసుకుంటే ఎముకల్లో గుజ్జు పెరుగుతుంది. 50 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ప్రతిరోజూ 30 నిమషాలపాటు మోకాలిచుట్టూ ఉండే కండరాలకు ఫిజియోథెరపీ, వ్యాయామం చేసుకోవాలి.

ఆర్థరైటీస్‌లో మూడు దశలు...

మొదటి దశలో ఉదయానే నిద్రలేవగానే మోకీళ్ళు పట్టివేసినట్లు ఉండటం, మెట్లు ఎక్కినా, దిగినా నొప్పులు రావటం, కింద కూర్చుని లేచేందుకు ఇబ్బంది పడటం, ఇండియన్ టాయ్‌లెట్ వాడేందుకు ఇబ్బంది పడటం జరుగుతుంది. ఫిజియోథెరపీతో దీనిని నియంత్రణలో పెట్టవచ్చు. రెండో దశలో కూర్చుని లేవటానికి ఇబ్బంది పడటం, నడక ప్రారంభంలో 10 అడుగులు వేశాక నొప్పి ఉండి తర్వాత తగ్గటం, మెట్లు ఎక్కినా, దిగినా ఇబ్బందిగా ఉంటుంది. సంప్రదాయ మరుగుదొడ్డి వాడలేక ఇబ్బంది పడతారు. వైద్యుల సలహాలు పాటిస్తూ కొన్ని రకాల మందులు, జాయింట్స్‌లో ఇంజెక్షన్లు చేయించుకుంటూ వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. మూడో దశలో కీళ్ల మార్పిడి ఆపరేషన్ (జాయింట్ రీప్లేస్‌మెంట్) తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే.

21న సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ

లక్ష్మీపురం: గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 21న సాయంత్రం 4గంటలకు సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభను జయప్రదం చేయాలని శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సభ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు, శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ కూటమి 3వ సారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి ఇంధనం ధరలు తగ్గినా మన దేశంలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గక పోగా పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకుతెచ్చి భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇసుక సమస్య తీవ్రంగా ఉందని, భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు జరపకుండా సున్నితమైన అంశాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ఈ స్థితిలో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని, ఈ నేపథ్యంలో జరిగే సభలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు బెర్రగాని శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, కృష్ణకాంత్, సాంబశివరావు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు



సీఈవో జ్యోతిబసుకు వినతి పత్రం, నోటీసు అందజేస్తున్న బసవ లింగారావు, ఎండీ ఖాలీద్

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించని పక్షంలో జడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ పేర్కొన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో సీఈవో వి. జ్యోతిబసును కలిసిన ఏపీటీఎఫ్ బృందం సమస్యలతో కూడిన వినతి పత్రంతోపాటు ప్రత్యక్ష కార్యాచరణ నోటీసు అందజేసింది. ఈ సందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రతి నెలా వేతనం నుంచి చెల్లిస్తున్న పీఎఫ్ చందా వారి ఖాతాల్లో అప్‌డేటెడ్‌గా జమ కావడం లేదని, 10 – 14 నెలల మొత్తాన్ని ఒకేసారి జమ చేస్తుండటం వల్ల వడ్డీ నష్టపోతున్నారని తెలిపారు. పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే రావాల్సిన మొత్తం పొందలేక, అవసరానికి ఉపయోగపడకుండా పోతోందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఉన్న మిస్సింగ్ క్రెడిట్స్‌ను అప్డేట్ చేయకుండా ఖాతాలో ఉన్న వరకే ఇస్తామంటూ, ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం తుది చెల్లింపులు పొందిన అనంతరం సదరు ఉపాధ్యాయులు పీఎఫ్ ఖాతాదారుడు కాదన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం పల్నాడు జిల్లాలోని 28 మండలాల పరిధిలోని ఉపాధ్యాయులందరికీ 2021 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు పీఎఫ్ చందా జమ చేయలేదని, దీనిపై గత సీఈవోతోపాటు కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. పీఎఫ్‌కు సంబంధించిన మొత్తం 11 సమస్యలను సకాలంలో పరిష్కరించని పక్షంలో ఈ నెలాఖరులో జడ్పీ ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసరావు, ఆర్.బాలరాజు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా చోరీలు.. 30కిపైగా షట్టర్లు ఫట్!

- గంజాయి విక్రయిస్తూ చిక్కిన నిందితుడు
- ఇప్పటికే అతడిపై పలు దొంగతనం కేసులు
- 3.78 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు

లక్ష్మీపురం: 15 సంవత్సరాలుగా చోరీలు చేస్తూ.. 30కిపైగా దుకాణాల షట్టర్లు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసుల్లో నిందితుడు పోలీసులకు చిక్కాడు. గంజాయి విక్రయిస్తుండగా పట్టాభిపురం పోలీసులకు పట్టుబడ్డాడు. తీగ లాగితే డొంక కదిలినట్లు దర్యాప్తులో అతడు చేసిన దొంగతనాల చిట్టా వెలుగుచూసింది. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసగా మారడంతో భార్య విడిచి వెళ్లిపోయింది. తర్వాత దొంగతనాల బాట పట్టాడు. ఆ డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. మార్కాపురం, గుంటూరులోని కొత్తపేట, పాతగుంటూరు, నగరంపాలెం, లాలాపేట, నల్లపాడు తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో దుకాణాల షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేసిన కేసులు ఇతడిపై ఉన్నాయి. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ చోరీలు చేస్తూనే ఉన్నాడు. ఇలా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 9వ తేదీన చోరీ కేసులో అరెస్టు అయ్యాడు. జైలుకు వెళ్లొచ్చాడు. తర్వాత తాడేపల్లి, అరండల్‌పేట, పట్టాభిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేశాడు. ఆ డబ్బుతో జల్సాలు చేస్తూ రైల్వే స్టేషన్‌ల పరిసరాల్లో సంచరించేవాడు. ఈ నెల 8వ తేదీన రాత్రి నల్లపాడు రైల్వే స్టేషన్‌లో ఒక గుర్తు తెలియని వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం వచ్చింది. పట్టాభిపురం పోలీసులు వెంటనే శ్యామలానగర్ గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో శ్యామలానగర్ రైల్వే ట్రాక్ వద్ద వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 3.78 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పట్టాభిపురం ఎస్సైలు రాంబాబు, తరంగిణి, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు, ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణా–గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో జరగనున్న ఎన్నికలకు డిగ్రీ పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. బ్రాడీపేటలోని గుంటూరు జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఓటర్ల నమోదు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007 నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఫోరమ్‌గా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం నిజాయతీతో పని చేశారని తెలియజేశారు. నవంబర్ 6 తేదీలోపు డిగ్రీ, డిప్లొమా పొందిన వారందరూ ఓటర్లు గా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఫారం–18 ద్వారా నమోదు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు,డిగ్రీ, డిప్లొమా సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, ఫొటో తప్పనిసరిగా జతచేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని తెలియజేశారు. సమాచారం కోసం గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల యూటీఎఫ్ కార్యాలయంలో అప్లికేషన్లు, ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం. హనుమంతరావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ గయాసు దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, యూ. రాజశేఖర్‌రావు, జి. వెంకటేశ్వరరావు, టి. ఆంజనేయులు, ఏ. శ్రీనివాసరావు, కె.కేదార్‌నాథ్, కె.ప్రేమ్ కుమార్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రభుజీ పాల్గొన్నారు.



ఏటీ అగ్రహారం దత్తసాయి సత్యదేవ మందిరంలో కనకదుర్గాదేవిగా..



కొరిటెపాడు గాంధీబొమ్మ కూడలిలోని రామాలయంలో దుర్గాదేవిగా



మారుతీనగర్‌లోని శ్రీ మారుతీ దేవాలయంలో శ్రీ దుర్గాదేవిగా..



సంపత్‌నగర్ శంకరమఠంలో అమ్మవారికి డ్రైఫ్రూట్స్‌తో అలంకారం

అమ్మ దర్శనం.. నయనానందకరం

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు, పారాయణాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. కొన్ని దేవాలయాల్లో కమిటీల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

– నగరంపాలెం



సిద్ధార్థనగర్ శ్రీ కనకమహాలక్ష్మి దేవాలయంలో శ్రీదుర్గాదేవిగా..



అరండల్‌పేట శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శ్రీ దుర్గాదేవిగా..



కృష్ణనగర్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దుర్గాదేవిగా..



వికాసనగర్ శ్రీషిర్డీసాయి మందిరంలో శ్రీదుర్గాదేవిగా..



మల్లికార్జునపేట శివాలయంలో శ్రీకనకదుర్గాదేవిగా..

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు సత్కారం



ఎస్పీని సత్కరిస్తున్న దళిత సంఘాలు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను గురువారం సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజాసుందర్‌బాబు, పదిహేను దళిత సంఘాలు సత్కరించాయి. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బెస్ట్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భీమసేన సేవాదళ్ నాయకులు నల్లపు నీలాంబరం, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు తిప్పాబత్తుని గోవింద్, జీజీహెచ్ ఉద్యోగుల అధ్యక్షులు ప్రేమజ్యోతిబాబు, ఏపీ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోపర్తి శ్రీను, రవి, భాగ్యరాజు, శ్రామిక కార్మిక సమాఖ్య జాతీయ నాయకులు మంచాల జోసెఫ్, దళిత నాయకులు జల్దీ మోహన్, సముద్రాల కోటేశ్వరరావు, కళ్యాణి పాల్గొన్నారు.

వచ్చే నెల 24న ఖురాన్ కంఠస్థ పోటీలు

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 3 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు దివ్య ఖురాన్ కంఠస్థ పోటీలను నవంబర్ 24న పొన్నూరు రోడ్డులోని అంజుమన్–ఏ– ఇస్లామియా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ గుంటూరు జిల్లా ఇంచార్జ్ మొహమ్మద్ జహీరుద్దీన్ గురువారం తెలిపారు. ప్రీ క్వార్టర్ ఫైనల్ నవంబర్ 24న గుంటూరు అంజుమన్–ఏ–ఇస్లామియా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో, క్వార్టర్ ఫైనల్ డిసెంబర్ 8న ఉదయం 9 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ ఉర్దూ బాయ్స్ స్కూల్‌లో, సెమీఫైనల్స్ 2025 జనవరి 5న నెల్లూరు జిల్లాలో, ఫైనల్స్ 2025 ఫిబ్రవరి 9న విజయవాడ ఆటోనగర్‌లోని ఆటోమొబైల్స్ టెక్నీషియన్ అసోసియేసన్ హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా ఇంచార్జ్ 9848286860 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవి



హారతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠపాలిత శ్రీ శంకర గాయత్రి దత్తసాయి మందిరంలో కనకదుర్గ అలంకారంలో ఉన్న అమ్మవారిని గురువారం ఎమ్మెల్యే గల్లా మాధవి దర్శించుకున్నారు. ఆమెను ఆలయ కమిటీ అధ్యక్షులు రాళ్లబండి వి.ఎస్.ఆర్.శర్మ, కమిటీ సభ్యులు గుండవరపు భాస్కర్, భావన్నారాయణ, తాడేపల్లి శివరాం సత్కరించారు.